

# నేతి సంబంధం నడ్డగాలుసు

— కుసుమ —

ఆశ అనేది మనిషిని ఉన్నతుణ్ణి చేస్తుంది; అధఃపాతాళానికి త్రొక్కి వేస్తుంది.

పొద్దు రెండు బారలెక్కింది. ఎండ కొద్ది కొద్దిగా తీవ్రమౌతున్నది. ఊరి పశువులన్నీ చెంగనాలు తీస్తూ మేతకు అడవికి బయలుదేరటంవలన సందడిగా బజారు, దుమ్ము ధూళితో నిండి ఉంది. కామయ్య పశువులను పాలేరుకు అప్పగించి చుట్ట వెలిగించుకుని చావిట్లో కూర్చున్నాడు.

ముందుకు సాగుతున్న ఒక అపరిచితవ్యక్తి లోపలికి వచ్చాడు "కామయ్యగారి ఇల్లెక్కడ" అంటూ.

కామయ్య 'ఇదే'నని చెప్పి లేచి మంచం వాల్చాడు. మంగతాయమ్మ ఎవరన్నట్లు భర్తవేపు చూచింది. 'నాకేం తెలుసు' అన్నట్లు పెదవి విరిచాడు

కామయ్య. మర్యాద సూచకంగా మంగతాయమ్మ కాళ్ళకు నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ఆ అపరిచితవ్యక్తి లేచి కాళ్ళు చేతులు కడుక్కున్నాడు.

ఎర్రగా, బక్కపలుచగా ఉన్న ఆ అపరిచితవ్యక్తి నాగరికుడిగా ఉన్నాడు చేతికి గడియారం, ఉంగరం, వగైరా ఉన్నాయి. తెల్లటి లాల్చీ, గ్లాస్కో పంచా ధరించాడు. వయస్సు నాలుగు పదులు దాటినా యువకుడిగా కన్పిస్తున్నాడు. వారి కుతూహలాన్ని కనిపెట్టిన ఆ అపరిచితవ్యక్తి –

"మాది ఖమ్మం దగ్గర కొక్కిరేణి– మీకు తెలుసు అనుకుంటా, నారాయణ రావుగారని పాలెం ప్రసిడెంట్-మొన్న ఖమ్మంలో కలసి మీ విషయం చెప్పాడు. మంచి సంప్రదాయం. అబ్బాయి బి.ఏ. పూర్తి చేశాడు. కొద్దిగా ఆస్తికూడా ఉంది. ఒక్కడే కొడుకు– వెళ్ళి చూడు అని.''

కామయ్యకు ఎక్కడలేని సంతోష మైంది. ఇంతలో మంగతాయమ్మ కాఫీ పట్టుకుని వచ్చింది. కామయ్య కాఫీ గ్లాసు అందుకుంటూ – "అబ్బా యిని చూడటానికి వచ్చారు. సోమ శేఖరంగారింటికి వెళ్ళినట్టుంది, కేకేయ్!" అన్నాడు.

మంగతాయమ్మ ముఖం పువ్వులా విచ్చుకుంది. ఆ అపరిచిత వ్యక్తి వివరించి చెప్పాడు:

"అమ్మాయికూడా హెచ్. ఎస్. సి. వరకు చదువుకుంది. తల్లి చనిపో యిన దగ్గరనుంచీ చాల గారాబంగా పెంచాను. త్వరగా పెండ్లి చేసి, దాని కడుపున ఒక కాయ కాస్తే చూచి జనం దించాలని ఉంది. ఎర్రగా, బొద్దుగా, అందంగా ఉంటుంది. అయినా నేను చెప్పటం అంతగా బాగులేదు."

"అదేమి టన్నయ్యగారూ! మన పిల్లల్ని గురించి మనం చెప్పుకోనకపోతే ఎలా?" అని అన్నది మంగతాయమ్మ.

ఇంతలో రాజశేఖరం వచ్చాడు.

''అబ్బాయి రాజశేఖరం! వీరు రామయ్యగారని కొక్కిరేణి. నిన్ను చూడటానికి వచ్చారు. పాలెం ప్రసి డెంటు నారాయణగారు లేరూ! వారు చెప్పారట;" నవ్వుతూ విషయం వివ రించాడు కామయ్య. రాజశేఖరం నమస్కారాన్ని స్వీకరించి, ప్రతి నమ స్కారం చేసి పరిశీలనగా చూచాడు రామయ్య.

చామనచాయలో ఉన్నాడు; వొడ్డూ పొడుగూ ఫరవాలేదు; మొహంలో పలుందాతనం ఉట్టిపడు తున్నది.తృప్తిగాచూశాడురామయ్య.

మంగతాయమ్మ నీళ్ళు తెచ్చి పెట్టింది.

''లెండి బావగారూ. భోజనాల తరువాత మాట్లాడుకుందాం,"అంటూ నీళ్ళు అందించాడు కామయ్య.

"చూడండి బావగారూ! నాకు వెనకా ముందూ ఎవరూ లేరు. ఆస్తి అంతా అమ్మాయి పేర వ్రాసి ఇవ్వమన్నా వ్రాసి ఇస్తాను; లేదా, నగదురూపంగా ఇవ్వమన్నా కొంత అమ్మి ఇస్తాను."

ఇరకాటంలో పడ్డాడు కామయ్య.

మంగతాయమ్మ, రామయ్య చేతిలో నెయ్యి వొంచుతూ "ఆస్తి అమ్మటం దేనికీ, అన్నయ్యగారూ! డబ్బంటే ఊరకే నే ఖర్చు అవుతుంది."

"నిజమే ననుకోండి, మీకు ముందు అమ్మాయి నచ్చాలిగా! పెండ్లిచూపులు త్వరగా జరిగి సంబంధం ఖాయపరుచుకుంటే అన్ని విషయాలూ వివరంగా మాట్లాడుకోవచ్చు తరువాత!" అన్నాడు రామయ్య.

భోజనాలు ముగించి రామయ్యా, కామయ్య కబుర్లు చెప్పుకుంటున్నారు. మంగతాయమ్మ రాజశేఖరాన్ని భోజనానికి పిలిచింది.

"అత్తయ్యకూతురు సుశీల ఉండగా వేరేసంబంధం మాట్లాడటం దేనికమ్మా?"

"ముప్ఫై మూడు వేలు - ఇస్తారట. కాట్నాలు - కానుకలు - లాంఛనాలు అన్నీ అందులోనే సర్దుకోవాలట!"

"అది కాదమ్మా! మీరు మొదటి నుంచీ వాళ్ళకు ఆశ పెట్టారు. ఇప్పుడిలా మాట్లాడటం ఏం బావుంది?"

"కలసి వచ్చే అదృష్టాన్ని కాలదంతామా?" అని తల్లి సమాధానపరచింది.

మెల్ల మెల్లగా చీకటి పడుతున్నది అడివికి వెళ్ళిన పశుగణం ఊరు చేరకుంటోంది. మంగతాయమ్మ దీపం వెలిగించింది. రాజశేఖరం మౌనంగా భోజనం ముగించి పడుకున్నాడు. పెండ్లి చూపులకి మంచిరోజు అడిగి వచ్చాడు కామయ్య. ఆ విషయం రామయ్యక్కూడా చెప్పాడు. అటుతరువాత చాల సేపు కబుర్లు చెప్పుకున్నారు.

తెల్లవారు ఝామున కామయ్య లేచి దీపం పెద్దది చేసి, చుట్ట వెలిగించుకున్నాడు. అప్పుడే కోడి కూసింది. అప్రయత్నంగా కామయ్య చూపులు రామయ్య పక్క మీద పడ్డాయి. అతడు లేడు.

"ఓయ్ ... ఓయ్ ... నిన్నే ..."

మంగతాయమ్మ బద్ధకంగా లేచి "ఏమిటి" అంటూ దగ్గరగా వచ్చింది.

"ఈ ... రామయ్య...!!"

విషయం గ్రహించిన మంగతాయమ్మ "అరిభగవంతుడా! నా పెద్దగొలుసు." బావురుమంటూ మెడ చూసుకున్నది.

"కొనకంచి రామయ్య అనే వ్యక్తి కొక్కిరేణిలోనే లేడట!" అప్పుడే వచ్చిన రాజశేఖరం అన్నాడు.

ఆ మాట విని కామయ్య, "పెళ్ళి సంబంధానికని వచ్చి పెద్దగొలుసు పట్టుకెళ్ళాడు. వీడెవడో - ఆరితేరిన దొంగలా ఉన్నాడు!" అని సరిపెట్టుకున్నాడు.